ప్రజాశక్తి
మంగళవారం 18 జూలై 2023
5
శ్రీకాకుళం



ముసురేసింది

- జిల్లాలో పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు
- మెళియాపుట్టిలో గరిష్ఠంగా 22.25 మి.మీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం తేలికపాటి వర్షాలు కురిశాయి. ఉదయం నుంచే మేఘాలు కమ్ముకున్నాయి. మెళియాపుట్టిలో గరిష్ఠంగా 22.25 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇచ్ఛాపురంలో కనిష్ఠంగా ఒక మి.మీ వర్షం పడింది. పలాసలో 17.25 మి.మీ, ఎచ్చెర్లలో 17 మి.మీ, లావేరులో 14.5 మి.మీ, గార మండలం కళింగపట్నంలో 14 మి.మీ వర్షపాతం నమోదైంది. పది రోజులుగా పెద్దగా వర్షాలు కురవకపోవడంతో జిల్లాను ఇంకా వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 220.0 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా 156.1 మి.మీ వర్షం పడింది. ప్రస్తుత ఖరీఫ్‌లో 3,98,750 ఎకరాల్లో వరి వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటివరకు సుమారు 1,19,865 వేల ఎకరాల్లో వరి విత్తనాలు వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

పతాక స్థాయికి జీడి పోరు

- ఉద్దానం గ్రామాలను చుట్టుముట్టిన జీపుజాతా
- జీడి రైతులకు వాటిల్లుతున్న నష్టంపై విస్తృత ప్రచారం
- నేడు కాశీబుగ్గ సంతమైదానంలో మహా ధర్నా
- సమాయత్తమవుతున్న రైతులు



జీడి పిక్కల మద్దతు ధరపై ఎపి రైతుసంఘం, జీడి రైతుల సంఘం చేపడుతున్న పోరాటం పతాక స్థాయికి చేరుకుంది. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న కవిటి మండల కేంద్రంలో ప్రారంభమైన జీపుజాతా సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని పలు ఉద్దానం ప్రాంత గ్రామాలను చుట్టుముట్టింది. సభలు, సమావేశాలు నిర్వహించి జీడి కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం, వ్యాపారుల మోసంపై చైతన్యం కల్పించారు. గ్రామాల్లో కరపత్రాలను పంచి ప్రచారం చేశారు. నాలుగు రోజుల పాటు సాగిన జాతాకు అడుగడుగునా ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. జాతా సోమవారం వజ్రపుకొత్తూరులో ముగిసింది. కాశీబుగ్గ సంతమైదానంలో మంగళవారం నిర్వహిస్తున్న మహాధర్నాకు తరలి వచ్చేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో జీడి రైతుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో, ఇళ్లలోనే దాచుకుంటున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పంట అమ్మితే తక్కువ ధరకే ఇవ్వాల్సి ఉంటోంది. అమ్ముకుండా నిల్వ ఉంచితే వర్షాలకు పిక్కలు పాడయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో ఏం చేయాలో రైతులకు దిక్కుతోచడం లేదు. జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 70 వేల ఎకరాలకు పైగా జీడి సాగవుతోందని ఉద్యానశాఖ అధికారులు చెప్తున్నారు. సాధారణంగా ఎకరాకు ఐదు బస్తాల దిగుబడి వస్తుందని అధికారుల అంచనాగా ఉంది. ఉద్దానం ప్రాంతంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వ్యాపారులు జీడి పంట కొనుగోళ్లు ప్రారంభించారు. ఏప్రిల్ రెండో వారం వరకు 80 కేజీల బస్తాకు రూ.10,500 వరకు చెల్లించారు. పంట చేతికి రావడం, రైతుల వద్ద పుష్కలంగా పిక్కలు ఉండడంతో క్రమేణా ధర తగ్గిస్తూ గరిష్ఠంగా రూ.8 వేల వరకు ఇచ్చారు.

వ్యాపారుల దయాదాక్షిణ్యానికి వదిలేసిన ప్రభుత్వం

జీడి రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాల్సిన ప్రభుత్వం వ్యాపారులకు మేలు చేకూర్చేలా వ్యవహరిస్తోంది. పిక్కలకు మద్దతు ధర ప్రకటించకుండా వారి ఇష్టారాజ్యానికి వదిలేసింది. ప్రభుత్వం తరుపున కొనుగోళ్లు చేయకుండా వ్యాపారులపై ఆధారపడేలా చేసింది. మరోవైపు పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తీరూ అలానే ఉంది. మద్దతు ధరపై 2020లో వ్యాపారులు, రైతులతో సమావేశం నిర్వహించి 80 కేజీల బస్తాకు రూ.పది వేలుగా ప్రకటించారు. అందులో ప్రభుత్వం తరుపున రూ.వెయ్యి చెల్లిస్తామని హామీనిచ్చారు. ఇప్పటివరకు ఆ డబ్బులు ఇవ్వలేదు. తర్వాత సంవత్సరం ప్రభుత్వమే పిక్కలను కొంటుందని, 80 కేజీల బస్తాకా?, క్వింటాకా? ధర నిర్ణయంలో ఉండటూ మంత్రి అప్పలరాజు ఆ ఏడాది ఊరించారు. ఈ సంవత్సరం జూన్‌లో మరోసారి ఇరువురు చర్చలు నిర్వహించి, రైతులకు సరైన మద్దతు ధర ఇవ్వాలంటూ వ్యాపారులకు చెప్పి ఆ తర్వాత దాని ఊసెత్తలేదు. ఆ తర్వాత వ్యాపారులు పరిశ్రమలు బంద్‌కు పిలుపునిచ్చారు. రైతులు అడుగుతున్న రేటు ఇవ్వాలని మంత్రి ఆదేశిస్తే, వ్యాపారులు అమలు చేయకుండా ఉంటారా?. పరిశ్రమలను బంద్ చేస్తే కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని వద్దని వారిస్తే ఎవరు మూసేస్తారు?. ఇటువంటి ప్రయత్నాలేవీ మంత్రి అప్పలరాజు వైపు నుంచి జరగలేదు. ఈ నేపథ్యంలోనే జీపుజాతా, మహాధర్నా చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

ధర్నాను జయప్రదం చేయాలి

జీడిపిక్కలకు మద్దతు ధర, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో కాశీబుగ్గ సంతమైదానంలో మంగళవారం ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతుల సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ తెలిపారు. ధర్నాకు రైతు సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి.తులసీదాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సత్యనారాయణ, కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు హాజరు కానున్నారని తెలిపారు. రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.



జీపుజాతాలో మాట్లాడుతున్న మోహనరావు

ప్రభుత్వం ఎవరి పక్షం..?

- ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు
- ముగిసిన జీపుజాతా

వజ్రపుకొత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం జీడి రైతుల పక్షాన ఉంటుందా..? జీడి యాజమాన్యాల పక్షాన ఉంటుందా? చెప్పాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన జీపుజాతా నాలుగో రోజు సోమవారంతో ముగిసింది. చివరి రోజు వజ్రపుకొత్తూరు మండలంలోని గడూరు, డెప్పూరు, మెట్టూరు, గునుపల్లి, అక్కుపల్లి, బైపల్లి, బాతుపురం, చినవంక, పల్లిసారథి, డోకులపాడు, కిడిసింగి, వజ్రపుకొత్తూరు తదితర గ్రామాల్లో జోరు వర్షంలోనూ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి నేటివరకు అన్ని వస్తువుల ధరలు వంద నుంచి 150 శాతం పెరిగాయన్నారు. 2019లో రూ.14 వేలు ఉన్న 80 కేజీల జీడిపిక్కల బస్తా నేడు రూ.ఏడు వేలకు ఎందుకు పడిపోయిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీడి రైతు పండించిన పంటకు మాత్రం ధర తగ్గిపోతోందని, జీడిపప్పు ధర మాత్రం ఆకాశాన్ని తాకుతోందన్నారు. జీడి మద్దతు ధరపై జిల్లాలోని మంత్రులు సీదిరి అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈనెల 18వ తేదీన కాశీబుగ్గ సంత మైదానంలో నిర్వహించే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు తమ్మినాన భాస్కరరావు, కె.బాలాజీరావు, కె.హేమసూదనరావు, బమ్మిడి రామకృష్ణ, తెప్ప లక్ష్మణరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద జీడి పిక్కలు దగ్ధం

ప్రజాశక్తి - పలాస

జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించాలని వామపక్షాల ఆధ్వర్యాన పలాస తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు జీడి పిక్కల బస్తాను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు ఎన్.గణపతి, వంకల మాధవరావు, సిహెచ్.వెంకటరమణ, తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ మేలో కొనుగోలు కావాల్సిన జీడిపిక్కలు నేటికీ రైతుల వద్ద ఉన్నాయన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పత్తి రైతుల లాగానే జీడి రైతులూ ఆత్మహత్యలకు పాల్పడే అవకాశముందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకుని మద్దతు ధరకు జీడిపిక్కలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు పాల్గొన్నారు.



జీడి పిక్కలను దహనం చేసి నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

జీడి రైతాంగ పోరాటానికి సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జీడి రైతుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు తెలిపారు. రైతాంగ ఉద్యమంలో పెద్దఎత్తున ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో రూ.14 వేలుగా ఉన్న జీడిపిక్కల బస్తా ధర ప్రస్తుతం రూ.ఏడు వేలకు మాత్రమే కొనుగోలు చేస్తామని యాజమాన్యాలు చెప్పడం రైతాంగానికి తీరని ద్రోహమే అవుతుందన్నారు. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, జీడి పంట విస్తరణకు, నిర్వహణకు గతంలో ఇచ్చిన రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ ద్వారా ఎకరా జీడితోట అభివృద్ధికి రూ.94 వేల వరకు రైతులకు అందించాలన్నారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని కోరారు.



శ్రీకాకుళం : కోర్టు ఆవరణలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్, ఆమదాలవలస, సోంపేట

న్యాయవాదులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు డిమాండ్ చేశారు. ఇటీవల కృష్ణా జిల్లా అవనిగడ్డలో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి జిల్లా కోర్టు ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు న్యాయమూర్తుల తరహాలో రక్షణ చట్టం అమల్లోకి తీసుకురావాలని కోరారు. న్యాయవాదులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రాము, బిసి న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర సభ్యులు కూన అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి ఆధ్వర్యాన న్యాయవాదులు విధులను బహిష్కరించారు. న్యాయవాదిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టు ఆవరణలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు సాధు ధనుంజయరావు, పైడి వరహానర్సింహం, తమ్మినేని అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు. సోంపేటలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణరావు ఆధ్వర్యాన న్యాయవాదులు విధులు బహిష్కరించారు.

పంచాయతీ నిధులు కొల్లగొట్టారు

చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ల సంఘం నాయకుల ఫిర్యాదు



ప్రదర్శన నిర్వహిస్తున్న సర్పంచ్‌లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీల్లోని రూ.8,600 కోట్లను కొట్టగొట్టేశారని, వీటిపై విచారణ చేసి న్యాయం చేయాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు పిన్నింటి భానోజీరావులు డిమాండ్ చేశారు. నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి నుంచి ఎస్‌పి కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టి అంబేద్కర్ జంక్షన్‌లో ఆయన విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అక్కడ్నుంచి ఎస్‌పి కార్యాలయానికి చేరుకుని ఎస్‌పి స్పందన కార్యక్రమంలో ఎఎస్‌పికి వినతిపత్రం అందజేశారు. 2018 నుంచి 2022 వరకు కేంద్ర ప్రభుత్వం 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కింద రూ.6,660 కోట్లను మంజూరు చేసిందని, రెండున్నరేళ్ల కిందట ఎన్నికైన సర్పంచ్‌లు తమ సిఎఫ్‌ఎంఎస్ అకౌంట్లు చెక్ చేసుకోగా నగదు నిల్వ కనిపించడం లేదన్నారు. దీనిపై పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం అందజేశామని చెప్పారు. సిఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లో ఉండాల్సిన రూ.8,600 కోట్లను దొంగిలించారని, దీన్ని సైబర్ నేరంగా పరిగణించి కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అరవల ప్రతాప్, అప్పలనాయుడు, చల్ల శ్రీనివాస్, భైరి నరేష్, పంచిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇకెవైసికి నేడు ఆఖరు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్



జనవరి నుంచి చేపడుతున్న సిఎఫ్‌ఎంఎస్ చెల్లింపులకు ఫ్యాక్టర్ అథెంటికేషన్ తప్పనిసరి అని ఖజానా శాఖ డీడీ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ప్రతిఒక్కరూ లాగిన్, ఇతర విలువైన సమాచారం భద్రపరచుకునేందుకు వీలుగా ఇకెవైసి తప్పక చేయించుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఖాతాకూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ అవసరమని తెలిపారు. డిడిఒ పరిధిలోని ఉద్యోగులకు వారి ఇకెవైసి ఐడితో లాగిన్ చేయాలని, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, ఎయిడెడ్ గ్రాంట్ ఉద్యోగులు మూడో పార్టీ చెల్లింపులున్న వారు ఇకెవైసి ట్రెజరీ హెర్బ్ వెబ్‌సైట్‌లో మ్యాపింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ లోగా మ్యాపింగ్ కాని వారికి ఇకపై ఎటువంటి ఆర్థిక లావాదేవీలు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. శ్రీకాకుళం సబ్ ట్రెజరీ పరిధిలో 900మంది పెన్షనర్లు ఇకెవైసి అనుసంధానం చేసుకోలేదని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నెలాఖరుకు రీ సర్వే పూర్తి

శ్రీకాకుళం అర్బన్ : రీ సర్వే పనులను వేగవంతం చేసి, ఈ నెలాఖరుకు శతశాతం పూర్తి కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి శ్రీకాకుళం డివిజన్ స్థాయి సర్వేయర్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులపై మండలాల వారీగా ఆరా తీసిన కలెక్టర్, పనుల వేగవంతంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. పనుల్లో జాప్యమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి చేసే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈనెల 27 నాటికి ఫారం-8 జనరేట్ చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ మురళీకృష్ణ, ఆర్‌డిఒ బి.శాంతి, సర్వే ల్యాండ్ రికార్డుల సహాయ సంచాలకులు ఆర్.విజయకుమార్, శ్రీకాకుళం డివిజన్ తహశీల్దార్లు, రీసర్వే డిటిలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

22, 23న అంగన్వాడీ జిల్లా మహాసభలు

పలాస : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలను కాశీబుగ్గలోని ఎస్‌ఎంసి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తెలిపారు. కాశీబుగ్గలోని సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు, సిఐటియు నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో గత పోరాటాలను సమీక్షించి, భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకోనున్నట్లు తెలిపారు. మహాసభలకు అధిక సంఖ్యలో అంగన్వాడీలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కన్నా అదనంగా వేతనాలు ఇస్తామని చెప్పిన సిఎం జగన్ అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. అంగన్వాడీలకు గౌరవ వేతనం చెల్లిస్తున్న ప్రభుత్వం, సిఎఫ్‌ఎంఎస్‌లో ఉద్యోగులుగా పొందుపరిచి వారిని సంక్షేమ పథకాలకు దూరం చేయడం అన్యాయమన్నారు. అంగన్వాడీలను ఉద్యోగులుగా ప్రభుత్వం భావిస్తే, వారికి రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు మంజుల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ కాశీబుగ్గ ప్రాజెక్టు కార్యదర్శి బి.ఆదిలక్ష్మి, కమిటీ సభ్యులు పి.పద్మావతి, కె.జ్యోతి, బి.సునీత తదితరులు పాల్గొన్నారు.



పరికరాలను అందుకుంటున్న ఎస్పి రాధిక

పోలీస్ శాఖకు పరికరాలు వితరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం/రణస్థలం

ఆక్సిస్ క్లినికల్ లిమిటెడ్ (అరబిందో ఫార్మా) గ్రూప్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శ్రేయాస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సహకారంతో జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌కు రూ.6 లక్షల విలువ చేసే 15 ఆల్కహాల్ బ్రీత్ అనలైజర్లు, 20 హైవోల్టేజ్ ఎల్ఈడీ రీఛార్జబుల్ టార్చ్ లైట్లు, ఎస్పి కార్యాలయానికి అందజేశారు. వీటిని ఎస్పి జి.ఆర్.రాధిక జె.ఆర్.పురం సిఐ ఎస్.ఆదాం, ఎస్ఐ జి.రాజేష్‌కు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైడిభీమవరం అరబిందో ఫార్మా పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమలు ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. అలాగే సిఎస్ఆర్ నిధులతో జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. అలాగే కరోనా సమయంలో సహాయ సహకారాలు అందించి ప్రజలను అన్ని విధాలుగా ఆదుకున్నారన్నారు. ఈ సందర్భంగా అరబిందో సంస్థలైన ఆక్సిస్ క్లినికల్ లిమిటెడ్, శ్రేయాస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

పారదర్శకంగా ఓటరు సర్వే

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఈనెల 21 నుంచి నిర్వహించనున్న సమగ్ర ఓటరు సర్వే గ్రామాల్లో పారదర్శకంగా నిర్వహించాలని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. తహశీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన బిఎల్‌ఒలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వే నిర్వహించి జాబితాలు తయారు చేయాలని సూచించారు. ఈ సర్వే సమయంలో ఎటువంటి అభ్యంతరాలు వస్తే సంబంధిత తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఇందులో వాలంటీర్ల ప్రమేయం ఉండరాదన్నారు. గ్రామాల్లో వలసలు వెళ్లిన వారిని సైతం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సమాచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు జామి ఈశ్వరమ్మ, చలమయ్య పాల్గొన్నారు.

జలంత్రకోట వాలంటీరు తొలగింపు

ప్రజాశక్తి - కంచిలి

మండలంలోని జలంత్రకోట గ్రామ వాలంటీరుగా పనిచేస్తున్న ఎస్.భువనేశ్వర్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎంపిడిఒ చల్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల గ్రామస్తుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం ఇఒపిఆర్‌డి రాంబాబు ఆధ్వర్యాన గ్రామంలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో వాలంటీరుపై వచ్చిన ఆరోపణలు నిజమని నిర్ధారణ కావడంతో అతడిని తక్షణమే విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శులు ఈశ్వరరావు, విజయలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్లు రమేష్, రంగ పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రం నాశనం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - సోంపేట

ఒక్క ఛాన్స్ అంటూ ప్రజల్లో తిరిగి... అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం అధోగతిపాలైందని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో ప్రచార కార్యక్రమంలో సోంపేట పట్టణంలోని గాంధీ మండపం వద్ద సోమవారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డికి కక్ష సాధింపు రాజకీయాలే తప్ప ప్రజల బాగోగులు పట్టడం లేదని అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన కొనసాగుతోందన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో ప్రజలు ఎక్కువ శాతం టిడిపికే పట్టం కడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ అమ్మఒడి, ఆసరా అంటూ నగదు అందిస్తున్న సిఎం వివిధ కార్పొరేషన్లలోని నిధులను దోచుకుంటున్నారన్నారు.

ఇచ్ఛాపురం : మూడో రోజు భవిష్యత్ గ్యారంటీ టిడిపి బస్సు యాత్రలో భాగంగా ఈదుపురం బహుదా గ్రోయిన్‌ను పరిశీలించారు. వంతెన వద్ద సెల్ఫీ తీసుకున్నారు. పట్టణంలోని టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇప్పటి వరకు లబ్ధిదారులకు అందజేయలేదని అన్నారు. ఇచ్ఛాపురంలో రోజూ గంజాయి అక్రమ రవాణా వార్తలే వస్తున్నాయని అన్నారు. ముందుగా ప్రజల దేవత స్వేచ్ఛావతి ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, నాయకులు సాలిన ఢిల్లీ, కాశ్రీ జయదేవ్, దక్కత ఢిల్లీరావు, కొండా శంకరరరెడ్డి, లీలారాణి పాల్గొన్నారు.



కవిటి : వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘాల నాయకులు

కవిటి: భవిష్యత్ గ్యారంటీ బస్సు యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా స్థానికులు ఉద్దానవన పంటలైన కొబ్బరి, జీడి మామిడి, ఆయిలాం కష్టపడి పండించిన ధాన్యాలకు సరైన గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని రైతు సంఘాల ప్రతినిధులు వాపోయారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా రైతులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో మనిచంద్ర ప్రకాష్, సీపాన వెంకటరమణ, పొందర కృష్ణారావు, బెందాళం రమేష్, పుల్లట సంతోష్, లోళ్ల శ్రీను పాల్గొన్నారు.



సోంపేట : మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

కంచిలి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో ప్రచార కార్యక్రమంలో భాగంగా మఠం కంచిలిలో బస్సు యాత్రను టిడిపి నాయకులు ప్రారంభించారు. ముందుగా ఎన్‌టిఆర్, సర్దార్ గౌతు లచ్చన్న, కింజరాపు ఎర్రంనాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదిన రామారావు, మద్దిల ఆనంద్, టి.వి.రమణ, రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

స్పీకర్‌ను కోరిన అక్కివరం గ్రామస్తులు

ఆమదాలవలస : ఉపాధ్యాయులను నియమించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని మండలంలోని అక్కివరం గ్రామస్తులు కోరారు. మండలంలోని తోటాడ, అక్కివరం, గోపీనగర్, మాసాహెబ్‌పేట గ్రామాల్లో రూ.2.12 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే కార్యక్రమంలో భాగంగా జలజీవన్ మిషన్ పనులకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కవరం గ్రామస్తులు తమ గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు తరగతులు ఉన్నాయని, అందులో 76 మంది విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. వారికి విద్యను బోధించడానికి నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. తెలుగు, మిగతా ఉపాధ్యాయులను నియమించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పేడాడ పుణ్యవతి తనకు ఇంతవరకు హౌసింగ్ బిల్లు రూ.60 వేలు మాత్రమే బ్యాంకు ఖాతాలో జమ అయ్యిందని, మిగతా మొత్తం పడలేదని స్పీకర్‌కు వివరించారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. అలాగే దూసి గడ్డపై చిన్న వంతెనను నిర్మించాలని, అవతల వైపు పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని రైతులు వివరించారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మాట ఇచ్చారు. మాసాహెబ్‌పేటలో కొన్నేళ్ల నుంచి డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరు పోయే దారి లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు వాపోయారు. స్పీకర్ మాట్లాడుతూ రూ.2 కోట్లతో డ్రెయినేజీ వ్యవస్థకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, కాంట్రాక్టర్‌కు సెప్టెంబరు మొదటి వారానికి పనులను పూర్తి చేసి ఇంటింటికీ తాగునీరు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మెట్ట శారద, ఎంపిటిసి తాండ్ర లక్ష్మి, సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి నీలారావు, బి.జయరాం, బి.గిరిబాబు, టి.మోహనరవు, బి.పెంటయ్య పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

ఆమదాలవలస : మణిపూర్ రాష్ట్రంలో శాంతి స్థాపన జరగాలని నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్, క్రైస్తవ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పట్టణంలో శాంతి ర్యాలీని నిర్వహించి వన్వే కూడలి వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పాస్టర్స్ పెద్దలు మణిపూర్ రాష్ట్రంలో 66 రోజులుగా నిర్విరామంగా కొనసాగుతున్న క్రైస్తవలపై దాడులు, మారణకాండ ఇప్పటివరకు నివారించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడం కేంద్ర ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో కిరణ్ పాస్టర్, రాడ్ విజయ్‌కుమార్, జార్జ్ ముల్లర్, ప్రత్తిపాటి ప్రసాద్, అసిర్ కుమార్, కంటిపాక కృపారావు శ్యాము, శామ్యూల్ జాను, కృపవరం పాల్గొన్నారు.

జీవామృతం తయారీ

ఆమదాలవలస: పంటలకు జీవామృతం వినియోగించడం వల్ల సూక్ష్మజీవులు నేలలో వృద్ధి చెంది పంటలకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని కొరపాంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో సోమవారం జీవామృతాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతిలో వ్యసాయంలో జీవామృతానికి పంటల్లో ముఖ్యపాత్ర ఉందన్నారు. జీవామృతాన్ని వరి పంటలో పిచికారీ చేస్తే... తెగుళ్ల బారి నుంచి రక్షణ ఉంటుందని, నేల సారవంతంగా మారి మంచి దిగుబడి పొందవచ్చునని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, జానకిరాం పాల్గొన్నారు.

భద్రతా లోపాల వల్లే ప్రమాదాలు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

భద్రత లోపం వల్లే తరచూ గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయిని, గ్రానైట్ కంపెనీల్లో కార్మికులకు భద్రత, సామగ్రిని ఉపయోగించే అవగాహన కల్పించేవారని, ప్రస్తుత ఆ పరిస్థితి లేదని గ్రానైట్ జిల్లా వర్కర్స్ నాయకులు, సిఐటియు నాయకులు నంభూరు షణ్ముఖరావు అన్నారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక కార్మికులను పనుల్లోకి తీసుకోవాలన్నారు. ఒడిశా, బీహార్ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకుంటున్నారని, వారికి భద్రత కల్పించడం లేదని అన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వల్ల యాజమాన్యాలు గ్రానైట్ కంపెనీలు ఖర్చులు పెరిగాయన్నారు. ప్రభుత్వాలకు అధిక ఫీజులు చెల్లించాల్సి వస్తుండడంతో కార్మికుల భద్రత, వేతనాలు ఇతర బెనిఫిట్స్ తగ్గించేశారని అన్నారు.

కార్మికుల సంక్షేమ చర్యలు పూర్తిగా వదిలేశారని అన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే నేరుగా సెంట్రల్ లేబర్ అధికారులకు ఫిర్యాదు చేసుకొనే అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. టెక్కలి జీడిపేట సమీపంలో ఉన్న సిహెచ్ గ్రానైట్‌లో మృతి చెందిన భూషణ్ దాస్ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకుంటూ... సంపూర్ణ వైద్యం అందించాలన్నారు.



గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

సోంపేట : పలాస మండలం పద్మనాభపురానికి చెందిన కొండే నవీన్ (23) ఆదివారం స్నేహితులతో వజ్రపుకొత్తూరు శివసాగర్ బీచ్‌లో స్నానానికి వెళ్లి రాకాసి అలల తాకిడికి గల్లంతైన విషయం విదితమే. ఈ మేరకు సోమవారం ఉదయం మండలంలోని బారువ తీరానికి యువకుడి మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికుల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడు ఆత్మహత్య

పొందూరు: పొందూరు పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సమీపంలో నివాసం ఉంటున్న చింతాడ విశ్వనాథరావు (67) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. మృతుడు భార్య చింతాడ సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు... తన భర్త రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి తనను మానసికంగా బాధించేవాడని తెలిపారు. రోజులానే ఈ నెల 16న ఉదయం తాగివచ్చి తనను తిట్టగా... తాను ఏమీ సమాధానం ఇవ్వకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై తనతో తెచ్చుకున్న పురుగుల మందు తాగడంతో వెంటనే స్పృహ కోల్పోయాడని అన్నారు. ఆయనను 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారని తెలిపారు. అక్కడ చికిత్స పొందతూ సోమవారం పరిస్థితి విషమించి మృత్యువాత పడినట్లు చెప్పారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రాపాకలో బైక్ చోరీ

పొందూరు : మండలంలోని రాపాకలో ఇంటి ఆవరణంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన సంచాన రాజారావుకు చెందిన బైక్ ఈ నెల 13 రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం ఉదయానే లేచి చూసేసరికి బైక్ లేకపోవడంతో ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే పొందూరు-కింతలి రహదారి పక్కనే ఉన్న ఈ ఇంటి ఆవరణంలో బైక్ దొంగలించడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

బూర్జ పిఎసిఎస్ సిఇఒ మృతి



శాస్త్రి (ఫైల్)

బూర్జ : బూర్జ వ్యవసాయ ప్రాథమిక పరిషత్ సిఇఒ పైడిమర్రి శాస్త్రి అనారోగ్యంతో సోమవారం మృతి చెందినట్లు ఇన్‌ఛార్జి సిఇఒ బలివాడ జగన్మోహనరావు తెలిపారు. శాస్త్రి 1992 బూర్జ పిఎసిఎస్‌లో క్లర్క్‌గా విధుల్లోకి చేశారు. అంచెలంచెలుగా అకౌంటెంట్ స్టాఫ్ అసిస్టెంట్‌గా, 2012లో సిఇఒగా ఉద్యోగోన్నతి పొందారు. 23 ఏళ్ల పాటు మండల రైతులకు అనేక సేవలు అందించారు. ఈ ఏడాది డిసెంబరు నెలలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. మూడు నెలలుగా అనారోగ్యానికి గురై ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఈయనకు భార్య సత్యవతి, కుమార్తె కృష్ణభార్గవి ఉన్నారు.



పరిశీలిస్తున్న విజయ, సాయిరాజ్

త్వరలో బాహుదా గ్రోయిన్ పూర్తి

ఇచ్ఛాపురం : మండలంలో కేశుపురం బాహుదా గ్రోయిన్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ అన్నారు. బాహుదా నదిలో గ్రోయిన్ నిర్మాణానికి రూ.28 లక్షలతో నిర్మిస్తున్న గ్రోయిన్ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు పూర్తి చేసి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, దువ్వు వివేకానంద, దున్న గురుమూర్తి, కేసుపురం, ఈదుపురం సర్పంచ్‌లు గుజ్జు ఢిల్లీరావు, నర్తు ప్రసాదరావు, కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, దుక్క ధనలక్ష్మి, కారంగి త్రినాథ్, మోహన్‌దాస్, చిట్టిబాబు, హేమంత్ పాల్గొన్నారు.

ఎస్‌పి స్పందనకు 36 అర్జీలు

శ్రీకాకుళం: స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీలనూ చట్ట ప్రకారం ప్రత్యేక శ్రద్ధ వహించి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 38 అర్జీలను స్వీకరించారు. పిటీషనర్ల బాధలు, సమస్యలను ఎస్‌పి సమగ్రంగా విన్నారు. ప్రతి పిటీషనర్‌తో ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలపై సానుకలంగా స్పందించారు. అనంతరం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సంబదిత అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు చేశారు. కుటుంబ కలహాలు ఆరు, పాతవి ఐదు, భూవివాదాలు ఎనిమిది, ఇతరత అంశాలు 19 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిపేస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని మాస్టర్ మైండ్స్ సంస్థ రీజియన్ ప్రిన్సిపాల్ షరీఫ్ అన్నారు. స్తానిక కళింగ వైశ్య కళ్యాణ మండపంలో సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాస్టర్ మైండ్స్ సంస్థ ప్రత్యేక ప్రతిభా పురస్కారాలను సోమవారం అందించారు. 2023 ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రూపుల వారీగా విభజించి ప్రత్యేక మెరిట్ ధ్రువపత్రాలు, ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున నగదును బహూకరించారు. విద్యార్థులకు కార్యక్రమంలో బోటనీ అధ్యాపకులు గణపతి ధనుంజయరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్ పాల్గొన్నారు. అవార్డు పొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, అధ్యాపకులు అభినందించారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పలాస

రాష్ట్రంలో రోజుకో చోట హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఖండించకపోవడం దారుణమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో విజయనగరం జిల్లా రాజాంకు చెందిన ఉపాధ్యాయుడు ఎ.కృష్ణ, బాపట్ల జిల్లా రేపల్లెలో బిసికి చెందిన అమర్నాథ్ చిత్రపటాలకు సోమవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థను స్వేచ్ఛలేకుండా చేశారని, రాజకీయ నాయకుల ప్రమేయంతో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని అన్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబానికి భరోసా ఇవ్వాల్సి పోయి నిందితుల తరపున వంత పాడుతూ మరింత క్షోభకు గురి చేయడం తగదన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, పట్టణ కార్యదర్శి ఎస్.నవీన్, కౌన్సిలర్ జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు పరామర్శ

స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మందస మండలం ముకుందపురానికి చెందిన తాతారావు, ఎ.భగీరథి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను శిరీష పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవసరమైన ఒక ఫోన్ చేస్తే సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆమెతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎఎంసి మాజీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, వెంకట్ రెడ్డి ఉన్నారు.

'మోడల్ టెక్'కు 34 మంది ఎంపిక

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ మోడల్ టెక్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ సోమవారం ఉద్యోగ నియామక ప్రక్రియలు నిర్వహించారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. మెకానికల్, సివిల్ బ్రాంచీలకు చెందిన 34 మంది విద్యార్థులు ఎంపికయ్యారని అన్నారు. 2022-23లో ఉత్తీర్ణులైన 34 మంది ఐతమ్ విద్యార్థులు మోడల్ టెక్ నిర్వహించిన రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్లలో విజయం సాధించి ఏడాదికి రూ. 2.4 లక్షల వేతనంతో ఎంపికైటనట్లు తెలిపారు. వీరికి డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.కుమార్‌లు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

వాడివేడిగా మండల సమావేశం



నిలదీస్తున్న సభ్యులు

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల మండల సమావేశం రసాభాసగా సాగింది. ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సమావేశం నిర్వహించారు. గోకర్ణపురం సర్పంచ్ రవికుమార్ పంచాయతీల్లోని సమస్యలపై అధికారులను నిలదీశారు. దీంతో కొంత సమయం గందరగోళంగా మారింది. గొప్పిలి, పెద్దలక్ష్మీపురం పంచాయతీ, మండల పరిషత్ నిధులు ఎక్కడెక్కడ, ఎంతెంత ఇచ్చారో సమాచార హక్కు చట్టం ద్వారా తెలియజేయాలని కోరారు. గోకర్ణపురం పంచాయతీ కార్యదర్శి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మెళియాపుట్టికి ఇన్‌ఛార్జిగా వేయడంతో తమ గ్రామ పంచాయతీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ సమస్యను పరిష్కరించాలని కోరారు. చాపర పంచాయతీలో విద్యుత్ లైన్‌మెన్ లేకపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ బోసి రామారావు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ లైన్ కోసం డబ్బులు చెల్లించిన నెలలు గడుస్తున్న సమస్య పరిష్కారం కావడం లేదని కరజాడ సర్పంచ్ బమ్మిడి పున్నయ్య వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు పాల్గొన్నారు.

ఏడుగురికి షోకాజ్ నోటీసులు

- కొత్తూరు కాలేజీ సమస్యలపై ఎస్ఎఫ్ఐ వినతి
- 'స్పందన'లో 198 వినతులు స్వీకరణ



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో స్పందన, జగనన్నకు చెపుతాం, సురక్ష, ఎపి ఆన్‌లైన్, మీసేవల ద్వారా ప్రజలన ుంచి స్వీకరిస్తున్న వినతులను సకాలంలో పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్నారన్న అభియోగంపై ఏడుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. వారం రోజుల్లో వాటిని పరిష్కరించకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ మురళీకృష్ణకు ఆదేశించారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 198 వినతులను జెసి ఎం.నవీన్‌తో కలిసి సోమవారం వినతులను స్వీకరించారు. పనితీరులో నిర్లక్ష్యం కనబరుస్తున్నారన్న కారణంతో శ్రీకాకుళం ఆర్‌డిఒకు, పొందూరు, కొత్తూరు తహశీల్దార్లకు, ఆమదాలవలస సిఐ, కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఇద్దరికి, శ్రీకాకుళం డిఎస్‌పి కార్యాలయంలో పనిచేస్తున్న క్లర్కులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ముందుగా కొత్తూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండేళ్లుగా ఎకనామిక్స్ అధ్యాపకులు లేరని అన్నారు. దీంతో విద్యార్థులు నెలకు రూ.100 చెల్లించి ప్రయివేటు అధ్యాపకులను నియమించుకుని చదువుకుంటున్నారని అన్నారు. ఇటీవల ఆయనా రాకపోవడంతో తరగతుల నిర్వహణ జరగడం లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు హరీష్ చందులు స్పందనలో ఫిర్యాదు చేశారు. కళాశాలలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పౌరసరఫరాల శాఖ పరిధిలో ఎండియు ఆపరేటర్ల వాహన మిత్ర పథకానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించినా, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు ఆప్షన్ లేదని తిప్పి పంపిస్తున్నారని, అందువల్ల ఆపరేటర్లకు వాహన మిత్ర నగదు మంజూరు చేసి నేరుగా వారి ఖాతాలకు జమ చేయాలని ఎండియు ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ కోరారు. దళిత వాడల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎయిమ్స్ ప్రతినిధులు తైక్వాండో శ్రీను కోరారు. ఎచ్చెర్ల మండలం పెయ్యలవానిపేట సమీపాన తన ఇంటి స్థలాన్ని స్కూల్ స్థలంగా రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారని, లేఅవుట్‌లో రూ.లక్షలు ఖర్చు పెట్టి పదేళ్ల క్రితం కొనుగోలు చేసి తన కుమార్తె వివాహానికి అమ్ముకుందామంటే రికార్డుల్లో తప్పుగా నమోదు ఉందని, తమకు న్యాయం చేయాలని బాదిత మహిళ నాగమణి ఫిర్యాదు చేశారు. జగనన్న ఇళ్ల కాలనీ నిర్మాణంలో పని చేసిన భవన నిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణం పనిముట్లు సరఫరా చేసిన వారికి రూ.కోటికి పైగా చెల్లించిన మొత్తాన్ని కాంట్రాక్టరు రవికుమార్ వ్యక్తిగత ఖాతాలో వేసుకుని కనిపించకుండా పోయాడని పెద్దఎత్తున భవన నిర్మాణ కార్మికులు స్పందనకు వచ్చి ఫిర్యాదులు అందజేశారు. ఆన్‌లైన్ యాప్‌ల యువకులు పెద్దఎత్తున మోసపోతున్నారని, ఆ యాప్‌లను తక్షణమే నిషేధించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ జయదేవి, డిఎస్ఒ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా పరిషత్ సిఇఒ వెంకట్‌రామన్, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి జయప్రకాష్, డ్వామా పీడీ చిట్టిరాజు, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

20న బస్సు యాత్ర

బూర్జ : ఈ నెల 20న టిడిపి భవిష్యత్ గ్యారంటీ బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని, ఈ యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ కోరారు. మండలంలోని కొల్లివలసలో సర్పంచ్ ఎస్.సిమ్మన్న స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తొలుత నారాయణపురం ఆనకట్టను పరిశీలిస్తారని అన్నారు. ఆనకట్ట ఆధునికీకరణ పనులకు టిడిపి హయాంలో రూ.112 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. శ్రీనివాస్ గ్రామ సమీపంలో ఉన్న నాగావళి-వంశధార నదుల అనుసంధాన కాలువల పనులను పరిశీలిస్తారని అన్నారు. అనంతరం కొల్లివలసలో బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈయన వెంట ఎస్.దుర్గారావు, వాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో ఈనెల 20న టిడిపి భవిష్యత్ గ్యారంటీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు కోరారు. మండలంలోని కింతలిలో టిడిపి నాయకులను, కార్యకర్తలను సోమవారం కలిశారు. గ్రామంలో ఆరోజు మహిళలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన స్థలాన్ని పరిశీలించామన్నారు. ఈయన వెంట జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, నాయకులు కిల్లి రామారావు, కూటికుప్పల వెంకటఅప్పలనాయుడు, కూటికుప్పల లోకనాథం, శ్రీను ఉన్నారు.



కింతలిలో టిడిపి బస్సుయాత్రకు సన్నాహపరుస్తున్న నాయకులు

బదిలీ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సన్మానం

ప్రజాశక్తి - కవిటి

జగనన్న గృహకల్పలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లదే కీలకపాత్రని ఎంపిడిఒ పైల సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా పనిచేసి బదిలీ అయిన ప్రియా చాణిక్య, ఇప్పిలి భార్గవ్, ఆశ గౌరీ పట్నాయక్‌లకు సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న గృహకల్ప విజయవంతానికి నిరంతరం కృషి చేశారని అన్నారు. బదిలీ అయిన ఉద్యోగులు మండలంలో పూర్తిస్థాయిలో తమ సేవలు అందించారని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని బాధ్యతలు చేపట్టి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రహి, హౌసింగ్ ఎఇ సాయికిరణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉప్పాడ జయకృష్ణ, నర్తు కోటేశ్వరరావు, మాధవి, కృష్ణ, రవి, సురేష్, చక్రి, భూపతి, సింధు, ప్రియా, ఇందిర, కిరణ్ కుమార్, వేణు, జానకిరామ్, హర్ష పాల్గొన్నారు.



సన్మానం చేస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి

రాజశేఖర్‌కు సత్కారం

టెక్కలి : గ్రామీణ ప్రాంత వైద్యుల సంఘం నిర్వాహకులు సత్తారు రాజశేఖర్‌కి ఘనంగా సత్కరించారు. ఇటీవల ఢిల్లీలో రాజశేఖర్ అవార్డు తీసుకోవడంపై టెక్కలిలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రికి చెందిన గుండె వైద్యులు డాక్టర్ సాయితేజ, విజయ్‌కుమార్‌లు చేతుల మీదుగా సత్కారం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల పాత్ర కీలకమైందని తెలిపారు. ప్రజల్లో గుర్తింపు తెచ్చుకోవడానికి దోహదపడుతుందదన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ మరింతగా సేవలు అందిస్తానని అన్నారు. ఆర్.ఎల్.రాజు, కార్యదర్శి యాదవరావు, చాప రమణ పాల్గొన్నారు.


వృద్ధురాలు అందజేసిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం

నవరత్నాలతో ప్రజా సంక్షేమ పాలన

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నవరత్నాలతో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతున్నదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘంలోని ఐదో వార్డు పరిధిలోని అక్కివలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం ఈ నాలుగేళ్ల కాలంలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందకపోతే సచివాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, మామిడి ప్రభాకరరావు, మామిడి రమేష్, సాధు చిరంజీవి పాల్గొన్నారు.

వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్ : శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి యువత బాడీబిల్డింగ్ చేయాలని, సమాజంలో బాడీబిల్డింగ్‌కు ఆదరణ పెరగాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆలిండియా బాడీబిల్డింగ్ పోటీల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, నిత్య జీవితంలో ప్రతిఒక్కరూ వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ గోపీ, ఫ్లెక్స్ జిమ్ అధినేత కొమ్మాన గౌరీశంకర్, కరాటే శిక్షకులు రెడ్డి ఢిల్లీశ్వరరావు, బుక్కా యుగంధర్, హరీష్, బంకు రాజు, గణేష్, సందీప్ పాల్గొన్నారు.


పూడికలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

తోటపల్లి కాలువలో పూడికతీత

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని దేవరాపల్లి దగ్గర తోటపల్లి కాలువకు పూడికతీత పనులను సోమవారం చేపట్టారు. వర్షాలు కురవడంతో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో ప్రొక్లెయినర్ సహాయంతో మట్టిని తీయించారు. పూడికతీత పనులు చేపట్టడంతో ఎర్ర చెరువు నిండే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ చెరువు నిండితే ఈ ప్రాంతంలో రైతులకు సాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. ఎమ్మెల్యే సొంత నిధులతో కాలువ పూడికతీత పనులు చేపట్టడం రైతులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెఇ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీడి మద్దతు ధరపై టిడిపిది రాద్ధాంతం

వజ్రపుకొత్తూరు : ఉద్దానం జీడి పిక్కలకు మద్దతు ధరపై టిడిపి నాయకులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. మండలంలోని అక్కుపల్లిలో వైసిపి నాయకులతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి హయాంలో జీడి రైతులతో ఒక్కసారైనా ముఖాముఖి మాట్లాడారా? అని ప్రశ్నించారు. బస్సు యాత్రలు పేరుతో మంత్రి సీదిరి అప్పలరాజుపై ప్రేలాపనలు మానుకోవాలని హితవు పలికారు. జీడి మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం, రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో ఎప్పుడైనా ప్రస్తావించిన పాపాన పోలేదని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు వడ్డి కరుణాకర్, తిర్రి రాజారావు, డొంకాన విద్యాసాగర్, గూడ ఈశ్వరరావు, కోడ సోమేశ్వరరావు, వెంపల యోగి, తిర్రి లక్ష్మీనారాయణ, జోగ అప్పారావు పాల్గొన్నారు.

200 మందికి నేత్ర వైద్య పరీక్షలు

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది 200 మంది నేత్ర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 35 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు క్యాంప్ కో-ఆర్డినేటర్ సాయికుమార్ చెప్పారు. వీరిని ప్రత్యేక వాహనంలో విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్‌కు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్ పాల్గొన్నారు.

పేదవారిని ఆదుకునేందుకే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి- పోలాకి

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి పదేవాడినీ ఆదుకోవాలన్నదే సిఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని మబగాం, ఈదులవలస సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందాలన్నారు. విద్య కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖరు చేస్తుందని అన్నారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి నాయకులు కణితి సత్తిబాబు, చింతాడ ఉమా, తహశీల్దార్ శ్రీరాములు, సర్పంచ్ లక్ష్మి, సూపరింటెండెంట్ సూర్య ప్రకాష్, మండల ఎఒ చిరంజీవి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని అరకభద్ర, కేసుపురం సచివాలయాల్లో నిర్వహించిన జనగన్న సురక్షలో జెడ్‌పి


పోలాకి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌లు పాల్గొని 11 రకాల ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, కేశుపురం, ఈదుపురం సర్పంచ్‌లు గుజ్జి ఢిల్లీరావు, నర్తు ప్రసాదరావు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని కవిటిగ్రహారంలో సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పాల్గొన్నారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, ఎంపిడిఒ జి. శివప్రసాద్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫాల్గొనరావు, డిటి ఎన్.భాగ్యలక్ష్మి, మండల ఎఒ శ్రీకాంత్‌వర్మ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని చిన్నసానలో సర్పంచ్ బోనేల ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకులు పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, ఎంపిటిసి నంబాళ రాజశేఖర్, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజ, రైతు భరోసా కేంద్రం అడ్వైజరీ కమిటీ జిల్లా సభ్యులు కామరాజు పాల్గొన్నారు.


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిసిహెచ్ భాస్కరరావు

వైద్యులపై డిసిహెచ్ ఆగ్రహం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి సమయపాలన పాటించకుండా ఉదయం 10.30 గంటలైనా రాకుండా నిర్లక్ష్యం చూపడంపై వైద్యులపై డిసిహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రికి 10 గంటలు దాటినా వైద్యులు రాకపోవడంతో పలువురు డిసిహెచ్‌కు ఫోన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఉదయం 11.15 గంటలకు డిసిహెచ్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కొంత మంది వైద్యులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటలు వైద్యం అందించాల్సిన ఆస్పత్రిలో ఎలా నిర్లక్ష్యం చూపుతున్నారని సూపరింటెండెంట్ రామదాస్‌ను ప్రశ్నించారు. సూపరింటెండెంట్ పలువురి వైద్యులను వెనుకేసుకురావడానికి ప్రయతించడంతో ఆయనపైనా మండిపడ్డారు. ఆలస్యంగా వచ్చిన వైద్యులందరికీ మెమోలు జారీ చేస్తున్నట్లు విలేకరులతో చెప్పారు. మరోసారి రోగుల నుంచి గాని, ప్రజల నుంచి గాని ఫిర్యాదు వస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

మహిళా ఆర్థికాభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మెప్మా ఆధ్వర్యాన డ్వాక్రా సంఘాల సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని, వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చారని అన్నారు. ఇప్పటికే మూడు విడతలుగా


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో అక్కాచెల్లెమ్మలకు రుణాలు మాఫీ చేసే ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి మోహన్, సిఒ స్వప్న, కవిత, సంధ్య, పద్మ పాల్గొన్నారు.

పంట సాగు విధానాలు మారాలి



రణస్థలం: రైతులు వ్యవసాయ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రం, డ్రమ్ సీడర్ యంత్రం ద్వారా సాగవుతున్న వరిసాగు ప్రదర్శనా క్షేత్రాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల జూలై మూడో వారం వస్తున్నా అవసరమైన మేరకు వర్షాలు పడకపోవడం రైతన్నల్లో ఆందోళన కలిగిస్తుందన్నారు. అందుకు రైతులు ముందస్తుగా మేలుకొని మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేసవి దుక్కులు పూర్తి చేసుకోవాలని సూచించారు. వర్షాకాలం ఆరంభం నుంచే తక్కువ నీటి వినియోగంతో పంటలు పండించదగ ఆరు తడి విధానాలైన ఎరువు, విత్తనం ఒకేసారి వేసే యంత్రాన్ని ఉపయోగించి వరి సాగు చేయడం అన్ని విధాలా లాభదాయకం అన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు పి.రమణ, ఎస్.పి.నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

తిరుపతికి శిల్పకళారత్న జాతీయ పురస్కారం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంకకు చెందిన శిల్పి, ఉద్దానం యూత్ క్లబ్ సభ్యుడు భైరి తిరుపతికి జాతీయస్థాయి పురస్కారం లభించింది. సికింద్రాబాద్‌కు చెందిన సర్వేజనా సుఖినోభవంతు సంస్థ ఆరో వార్షికోత్సవం సందర్భంగా సుందరయ్య కళా నిలయంలో ఆదివారం రాత్రి శిల్పకళారత్న బిరుదుతో సన్మానించారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్, జాతీయ వినియోగదారుల మండల అధ్యక్షులు మందడి కృష్ణారెడ్డి, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పెంటపాటి కృష్ణాది


పురస్కారం అందుకుంటున్న తిరుపతి

శేషులు పురస్కారాన్ని అందజేశారు. జాతీయస్థాయిలో బొరివంక గ్రామ ప్రతిష్టను ఇనుమడింపజేసిన తిరుపతిని సర్పంచ్ బెందాళం శ్రీరామ్‌ప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్‌కుమార్, ఉద్దానం యూత్ క్లబ్ అధ్యక్షుడు లొట్ల దీనబంధు, క్లబ్ సభ్యులు అభినందించారు.

రూ.6 వేలు పింఛను ఇవ్వాలి

టెక్కలి : వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తాత్సారం చూపుతుందని, వీటిని వెంటనే పరిష్కరించాలని వికలాంగుల జాతీయ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు ఆవుల వేణుగోపాలరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులకు రూ.6 వేలు పింఛను ఇవ్వాలని కోరారు. వికలాంగలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పువ్వల చంద్రశేఖర్, పి.పితాంబరం, సన్నంశెట్టి నూకమ్మ, బగాది మాధవరావు, పి.మోహన్ పాల్గొన్నారు.

సూరిబాబు సేవానిరతి

టెక్కలి : టెక్కలి పంచాయతీ గోపీనాథపురానికి చెందిన వైసిపి కార్యకర్త సత్తారు సూరిబాబు తన సేవా నిరతి చాటుకున్నారు.


పూడికలు తీసున్న సూరిబాబు

వీధిలోని కాలువలో తానే స్వయంగా కాలువలోకి దిగి శిల్టు పూడిక తీత పనులను సోమవారం చేపట్టారు. సూరిబాబు స్వచ్ఛందంగా చేపట్టిన పనులను చూసిన ప్రాంతీయులు అభినందించారు. అయితే పంచాయతీ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో కాలువలో పూడికలు పేరుకుపోయాయని అన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసిన పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. వైసిపి కార్యకర్త చేపట్టిన సేవా నిరతి చర్చనీయాంశమైంది.


ఆర్థికసాయం అందజేస్తున్న శంకర్

గొండు శంకర్ ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సముద్రంలో వేటకు వెళ్లి బోటు బోల్తా పడి మృతి చెందిన పుక్కళ్ల లక్ష్మయ్య, గుంటు గణపతిరావుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ డిమాండ్ చేశారు. గార మండలం బందరువానిపేటలోని బాధిత కుటుంబలను సోమవారం పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ.పదేసి వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి టిడిపి కట్టుబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గుండ భాస్కరరావు, టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బడగల వెంకట అప్పారావు, తూలుగు మాజీ సర్పంచ్ కొయ్యాన జగదీష్, ప్రభాకరరావు, పుక్కల్ల కృష్ణ, రాజు, పోలయ్య పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న డిఎల్‌పిఒ రమణ

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

నౌపడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ అన్నారు. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతితో మమేకమై వాటి ఆవశ్యకతను భావితరాలకు అందించాలన్నారు. చెట్లు ప్రకృతి దృశ్యాన్ని ఆహ్లాదకరంగా మారుస్తాయన్నారు. గ్రీన్‌గార్డ్స్, గ్రీన్ అంబాసిడర్స్‌కు తడి చెత్త పొడి చెత్త నిర్వహణ, వేరు చేయు విధానం తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్య దర్శి ఉప్పాడ ఉమాపతి, సచివాలయ సిబ్బంది కౌసర్ ఖాన్, శ్రీరామ్, గవరయ్య, వెంకటరమణ, భీమారెడ్డి పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బాల్య వివాహాలతో చదువుకు దూరం

కవిటి: బాల్య వివాహాలు బాలికల విద్యకు ప్రతిబంధకాలుగా మారుతున్నాయని ఒడియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ పట్నాయక్ అన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు భవిష్యత్‌లో తీవ్ర అనర్థాలు, అనారోగ్యాలకు దారితీస్తాయని అన్నారు. విద్యార్థులు ఈ విషయంపై తమ తల్లిదండ్రులు, స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవి రోగులకు వైద్యం అందించాలి

శ్రీకాకుళం రూరల్: హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ పీపుల్స్ సొసైటీ ప్రెసిడెంట్ నేతల లక్ష్మణరావు అన్నారు. రిమ్స్‌లో సిఎస్ఆర్ ఎఒ డాక్టర్ వి.వి సుభాషిణిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. హెచ్ఐవి రోగులకు చెవి, గొంతు, ముక్కుకు సంబంధించిన శస్త్రచికిత్సలు జరిగేలా చూడాలని కోరారు. పిఎల్ హెచ్ఐవికి రక్త పరీక్షలో భాగంగా ఎస్‌జిఒటిఎస్ జిపిటి వైద్య పరీక్షలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.


మాట్లాడుతున్న జెడ్‌పిటిసి కృష్ణచైతన్య

సమిష్టి కృషితోనే అభివృద్ధి

పోలాకి : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమిష్టి కృషితో విధులు నిర్వహిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మూడు నెలలగా జరిగిన శాఖాపరమైన అంశాలపై చర్చించారు. జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైస్ ఎంపిపిలు కోట అప్పారావు, కె.తాతారావు, ఎంపిడిఒ ఉషశ్రీ, తహశీల్దార్ శ్రీరాములు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మనోజ్‌కు స్వర్ణ పతకం

సోంపేట: సోంపేటకు చెందిన దుప్పల మనోజ్‌కి జెనెటిక్ విత్తనాల తయారీలో చేసిన పరిశోధనలకు బంగారు పతకం వచ్చినట్లు ఆయన తండ్రి దుప్పల చలపతిరావు తెలిపారు. ఇటీవల బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మనోజ్‌కు నగదు పురస్కారంతో పాటు బంగారు పతకం ఎమ్మెల్సీ డాక్టర్ కుమార్ రెడ్డి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందించినట్లు చెప్పారు.